ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (సఖినేటిపల్లిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 11-2-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనలను మనం పవిత్రం చేసుకోవటానికి, భగవదనుభవం పొందటానికి తగిన అర్హత సంపాదించుకోవటానికి పనికి వచ్చేదే యోగం. నీవు కర్తృత్వం లేకుండా పని చేస్తే అంటే కర్తలేని కర్మను నీవు ఆచరిస్తే నీకు యోగం సిద్ధిస్తుంది. పరమేశ్వరుడి స్వరూపమును పొందుతావు. మనం ఎక్కడికైనా వెళ్ళాలి అని నిర్ణయం తీసుకొన్నప్పుడు అడుగులు లెక్క పెట్టుకోము, మనకాళ్ళు వాటిఅంతట అవే నడిచి వెళ్ళిపోతాయి. అలాగే భగవదనుభవం పొందాలి అనే కాంక్ష నీ హృదయాంతరాళములనుండి వస్తే మిగిలినవి అన్నీ వాటి అంతట అవే సమకూరతాయి, సద్గుణాలు కూడా వచ్చి మనలను వరిస్తాయి. కర్తలేని కర్మను ఆచరించమని భగవంతుడు చెపుతున్నాడు.

ఏదైతే నేను, నేను అంటున్నావో అదే నీ ఆధ్యాత్మిక అభివృద్ధికి అడ్డువస్తోంది. దానిని ఒక ప్రక్కకు పెట్టి పనిచేయటం అలవాటు చేసుకొంటే నీకు పనీ అయిపోతుంది, rest వస్తుంది అని కృష్ణుడు చెపుతున్నాడు. మన అందరకూ rest కావాలి గాని work అక్కరలేదు. పనిచేయకుండా ఎక్కువ rest గా ఉంటే తుప్పువస్తుంది. ఇంటిలో సామానులు వాడరు అనుకోండి అవి తుప్పు పట్టేస్తాయి అలాగే పనిచేయకుండా ఉంటే దేహము, మనస్సు తుప్పు పట్టేస్తాయి. అహంభావన లేకుండా పనిచేస్తూ ఉంటే పనీ అయిపోతుంది, పనిలోనే నీకు విశ్రాంతి దొరుకుతుంది. (కర్తలేని కర్మను ఆచరించటం వలన workలోనే rest దొరుకుతుంది. ప్రత్యేకంగా rest అక్కరలేదు.)

యోగం మొదట నీకు ఆముదంలా అనిపించినా పరిణామంలో అది సుఖాన్ని తీసుకొని వస్తుంది, మోక్షాన్ని తీసుకొని వస్తుంది. ఉన్నది ఒకటే. కాని వేషం వల్ల మనకు రెండుగా అనిపిస్తోంది. జీవుడు వాడి వేషమును తీసివేస్తే, ఈశ్వరుడు వాడి వేషమును తీసివేస్తే ఉన్నది ఒకటే. యోగం ఏమి చేస్తుంది అంటే రెండును ఒకటి చేస్తుంది.

శరీరమునకు ఆరోగ్యము కావాలంటే శరీరమునకు సంబంధించిన exercises చేస్తాము. మనస్సుకు ఆరోగ్యము కావాలంటే మనస్సుకు సంబంధించిన exercises చేయాలి. మన ఇంటిలో అటూ ఇటూ తిరుగుతూ మనకు తెలియకుండానే దేహమునకు సంబంధించిన exercises బాగానే చేస్తున్నాము. ఇంక మనస్సుకు సంబంధించిన exercises చేయాలి. పూజ, జపం, ధ్యానము ఇవి అన్నీ మనస్సుకు సంబంధించిన exercises. మనస్సుకు సంబంధించిన exercises వలన మనో నిగ్రహం కలుగుతుంది.

చెడ్డగుణాలు నేర్చుకోవటం తేలికే. అందులోనుండి బయటపడటం చాలా కష్టం. ఈశ్వరానుగ్రహం లేకుండా వాటిలోనుండి బయటపడలేము. మానవుడు అశాంతికి, అనారోగ్యమునకు, దారిద్ర్యమునకు దూరంగా ఉండాలంటే దుర్గుణాలు విడిచిపెట్టాలి. దుర్గుణాలవలన శారీరకంగానూ, మానసికంగానూ పతనమవుతాము. మనలో ఉన్న శక్తి తగ్గిపోతుంది. భగవదనుభవానికి దూరం అవుతాము. దుర్గుణాలనుండి విడదీసి భగవంతునిలో

ఐక్యం చేసేదే యోగం.

కామెర్లురోగం వచ్చినవాడికి తెల్లగా ఉన్నవి కూడా పచ్చగా కనిపిస్తాయి. అలాగే అహంభావన ఉన్నవాడికి ఆత్మ దేహముగా కనబడుతుంది. వాడు ఆత్మే. కాని ఆత్మ దేహముగా కనబడుతుంది. అందువలన దేహమునకు పరిమితమై ఉంటాడు. నీవు అనుకొన్నది సత్యం అవ్వదు. నీవు అనుకొంటే అనుకోవచ్చు. నీవు అసత్యమును సత్యము అని అనుకోవచ్చు, నీవు అనుకొన్నంతమాత్రంచేత అసత్యం సత్యం అవ్వదు.

నీవు ఏదైతే నేను, నేను అంటున్నావో అది స్వతంత్రమైనది కాదు. నీకు స్వతంత్రము కావాలంటే, శాంతి కావాలంటే ఏ నేనులో అయితే స్వతంత్రము ఉందో ఆ నేనుని పట్టుకోవాలి. ఈ నేను చుట్టూ తిరుగుతూ నీకు ఎంత ప్రయత్నం చేసినా స్వతంత్రము రాదు. ఎందుచేతనంటే ఈ నేనులో స్వతంత్రము లేదు. స్వతంత్రమైన నేను దేహముతోటిగాని, ప్రపంచముతోటిగాని, కాలంతోటిగాని దేవుడితోటిగాని కలిసి ఉండదు. దానికి సపోర్టులు అక్కరలేదు. అబద్ధమైన నేనుకు సపోర్టులు కావాలి.

అబద్ధమైన నేను మనస్సుతోటి, దేహంతోటి కలిసి ఉంటుంది. దేహమునకు, మనస్సునకు అనుకూలమైన వారిమీద ఇష్టం పెంచుకొంటుంది, ఎవరైతే అనుకూలంగా లేరో వారిమీద అయిష్టం పెంచుకొంటుంది. ఇష్టమైనవారిని చూసినా, అయిష్టమైన వారిని చూసినా బాహ్యమునకు వచ్చేస్తుంది. ఏదోరకంగా మనస్సు బాహ్యమునకు వచ్చేస్తుంది. ఏ విషయములవలన మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తోందో ఆ విషయాలకూడా మనస్సును వెళ్ళనివ్వవద్దు. ఆ విషయాలనుండి మనస్సును వారించు. మనిషి వాడి శరీరము ఎక్కడ ఉంటే అక్కడ ఉండడు, వాడి మనస్సు ఎక్కడ ఉంటే అక్కడ ఉంటాడు. అందువలన మనస్సు ప్రధానము. మనస్సు విషయాలతో కలవకుండా ఆత్మతో కలిసి ఉండేటట్లు చూసుకో. అక్కడ నీ తెలివిని, యుక్తిని, శక్తిని ఉపయోగించాలి. నీకు తెలివి ఉంటే, వివేకం ఉంటే నీ హృదయంలో ఉన్న సత్యమును తెలుసుకోవటానికి ఆ తెలివిని, వివేకమును ఉపయోగించుకోకపోతే దానిని ఏమి చేసుకొంటావు అంటున్నారు.

దేహము చనిపోయినపుడు దేహగతమైన నేను చావదు. దేహముతో ఉన్న తాదాప్యంవలన దేహం చనిపోయినపుడు నేను చనిపోతున్నాను అనుకొంటాడు. దేహమే సర్వస్వం అనుకోవటంవలన దేహం మరణించినపుడు వాడు దుఃఖపడతాడు. దానినే అభిమానబుద్ధి అంటారు. నీకు యోగం సిద్ధించాలి అంటే నీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా అభిమానబుద్ధిని త్యాగం చేయమని వాసుదేవస్వామి గీతలో చెప్పారు. అభిమానబుద్ధి యోగమును భంగం చేస్తుంది. నీవు ఆధ్యాత్మికంగా అభివృద్ధిపొందటానికి ఇతరులు అడ్డురావటం లేదు. నీ అభిమానబుద్దే అడ్డువస్తోంది.

మనస్సు ఒకేసారి రెండు పనులు చేయలేదు. అటు భోగంవైపుకైనా వెళుతుంది లేక ఇటు యోగం వైపుకైనా వెళుతుంది. ఒకేసారి యోగం వైపుకు, భోగం వైపుకు వెళ్ళలేదు. అబద్ధమైననేనుకు ఉన్న సపోర్టులను మీరు ఊడగొట్టుకోలేకపోతే గురువును ప్రార్థిస్తే ఆయన ఊడగొట్టిపెడతాడు. అవి ఊడగొట్టినపుడు మీకు బాధ తెలియకుండా మత్తు ఇస్తాడు వాడు గురువు. మీకు మత్తు పెట్టి మీకు ఉన్న సపోర్టులను ఊడగొడతాడు. నీకు ఉన్న సపోర్టులను ఊడగొడితేనే గాని మనస్సు వెళ్లి హృదయంలో లయం కాదు.

భక్తులకు కూడా అహంభావన ఉంటుంది. మేము మూడు గంటలు జపం చేసాము, నాలుగు గంటలు ధ్యానం చేస్తున్నాము అంటారు. ఇలా కాలం లెక్కపెట్టుకొంటూ ఉంటారు. ఇదో రకమైన అహంభావన. మేము మంచివారము అనుకొంటూ ఉంటారు. అదోరకమైన అహంభావన. నిజమైన మంచివారికి వారిలో మంచితనం ఉంది అనే సంగతే వారికి తెలియదు. వాడు మంచివాడు అంటే.

మనస్సు ఏవిషయం గురించి అయితే ఆలోచిస్తోందో అది ఒక్కటే నిజం అనిపిస్తుంది. చూసేవాడు ఎంత నిజమో చూడబడేది కూడా అంతే నిజము. ఆ విషయానికి శక్తిలేదు. ఆ విషయాన్ని స్మరించటంవలన మనస్సు ఆ విషయానికి శక్తినిస్తోంది. ఎప్పుడైతే నీ మనస్సును ఉపసంహరించావో ఆ విషయానికి ఉన్న శక్తి కూడా తగ్గిపోతుంది.

విషయాలతో మనస్సును అనుసంధానం చేయకుండా, దృశ్యములతో మనస్సును అనుసంధానం చేయకుండా విషయచింతనను విడిచిపెట్టి నిరంతరము ఆత్మనే చింతిస్తూ ఉంటే నీవు ఆత్మాకారమును పొందుతావు. విషయ చింతన ఎంత ప్రమాదమైనది అంటే విషయాలను చింతిస్తూ ఉంటే ఆ విషయాలను సంపాదించాలనే బుద్ధి కలుగుతుంది. సంపాదించేటప్పుడు ఎవడైతే అడ్డు వచ్చాడో వాడిమీద కోపం కలుగుతుంది. కోపం వచ్చినపుడు వివేకం తగ్గిపోతుంది. అప్పుడు వాడు ఏమి మాట్లాడుతున్నాడో, ఏమి చేస్తున్నాడో వాడికే తెలియదు. వివేకం తగ్గిపోయినపుడు నెమ్మదిగా బుద్ధి నశిస్తుంది. బుద్ధి నశించినపుడు నీవు ఇహానికి పనికిరావు, పరానికి పనికిరావు. విషయ చింతన పరిణామంలో ఇహానికి, పరానికి పనికిరాకుండా చేస్తుంది. ఆత్మను చింతించగా, చింతించగా నీవు ఆత్మాకారం పొందుతావు. ఆత్మకు మరణం లేదు కాబట్టి మరణం లేని స్థితిని నీవు కూడా పొందుతావు.

నిన్ను ఎవరైతే ధ్యానం చేస్తున్నారో, నిన్ను ఎవరైతే స్మరిస్తున్నారో వారి అహంభావనను తొలగిస్తాను అని జెండా ఎగరవేసి చెప్పావు అని అరుణాచలేశ్వరుడితో భగవాన్ అన్నారు. ఆ ప్రతిజ్ఞను నిలబెట్టుకొంటున్నావు. నీవు ఇలా చెపుతున్నావు కదా అని నిన్ను కట్టుకొన్నాను. నిన్ను కట్టుకొన్నాక నా రూపమునకు, నామమునకు కాకుండా చేసావు అరుణాచలేశ్వరుడా అన్నారు భగవాన్. జ్ఞానాన్ని ఇస్తాను అని ప్రతిజ్ఞ చేసావు. అందుకు నిన్ను కట్టుకొన్నాను. కట్టుకొన్నాక జ్ఞానాన్ని ఇచ్చావు. అప్పుడు నా రూపము, నామము నాకు కాకుండా పోయాయి అరుణాచలా అని భగవాన్ అన్నారు.

తత్వం అంటే అది నీవై ఉన్నావు అని అర్థం. ఏదైతే దేవుడు, దేవుడు అంటున్నావో అది నీవే అయి ఉన్నావు. నీవు ఏదైతే పొందుదామని అనుకొంటున్నావో అది నీవే అయి ఉన్నావు. కాని అది నీవే అయి ఉన్నావు అనే అనుభవం నీకు లేదు. అందువలన అసంతృప్తి వస్తోంది, కోరిక వస్తోంది. నీవు దేనినైతే తెలుసుకోవాలి అనుకొంటున్నావో, దేనికోసమైతే పూజలు, జపాలు, తపస్సులు చేస్తున్నావో అది నీవే అయి ఉన్నావు. అది నీవు కాదు అనుకో దానిని ప్రయత్నం చేసి సంపాదించటం అనవసరము అన్నారు రమణ మహర్షి. మధ్యలో వచ్చినది మధ్యలోనే పోతుంది అన్నారు. నీవు ప్రయత్నం చేయటం వలన వచ్చేది మరల కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంది అన్నారు. ఉన్నవస్తువు ఉన్నట్లుగా ఉంది. నీకు తెలిసినా ఉంది, తెలియకపోయినా ఉంది. ఆ వస్తువు నీకు తెలియకుండా నీ మనస్సులో ఉన్న చాపల్యమే అడ్డువస్తోంది. నీ మనస్సులో ఉన్న చాపల్యమును, నీ మనస్సులో ఉన్న దోషములను తీసివేయటమే నీ సాధనల యొక్క ప్రయోజనం కాని సనాతనంగా ఉన్న వస్తువును కనిపెట్టటానికి కాదు. పూర్వం లేకుండా నీవు కొత్తగా కనిపెట్టటంవలన అది వస్తే దానికోసం కష్టపడి సాధనలు చేయటంవలన ప్రయోజనం లేదు. అది అన్ని కాలములలోనూ ఉంది, అన్ని అవస్థలలోనూ ఉంది, అన్నిచోట్లా ఉంది.

రాగమును విడిచిపెట్టు, భయమును విడిచిపెట్టు, ద్వేషమును విడిచిపెట్టు అని గీతలో పదే పదే చెపుతాడు. ఎందుకు విడిచిపెట్టాలి? రాగము, భయము, ద్వేషము ఇవి అన్నీ మనస్సును బాహ్యముఖానికి తీసుకొనివస్తాయి. భగవంతునికి దూరం చేస్తాయి. అందువలన వాటిని విడిచిపెట్టు అని చెప్పాడు.

ధ్యానమునకు, జపమునకు మనోవృత్తి ఉండాలి. విచారణ అంటే మనోమూలమును చూడటం. మనస్సు దాని మూలమును అది చూడకుండా అది నశించదు. మనస్సును ఉపసంహరించాలి. గర్వం ఉన్నమనిషి బయటకు విజృంభిస్తూ ఉంటాడు, మనస్సును నిగ్రహించలేడు. నిగర్వి మనస్సును నిగ్రహించటానికి చూస్తే, ప్రయత్నంచేస్తే కొంచెం లోపలకు ఉపసంహరించగలుగుతాడు.

మనస్సును దాని మూలంలోనికి వెళ్ళేవరకూ ఉపసంహరించాలి. ఎంతకాలం చేయాలి అంటే అర్థంలేదు, ఎంతకాలం ఈ మందు వాడాలి అని డాక్టరును అడిగితే రోగం తగ్గే వరకూ వాడమని చెపుతాడు. కుండకు మసి ఉంది అనుకోండి, ఎంతకాలం తోమమంటారు అంటే ఏమిటి అర్థం. మసిపోయేవరకూ తోమాలి. అలాగే మనస్సును దాని మూలంలోనికి వెళ్ళేవరకూ ఉపసంహరించాలి. మనస్సు దాని మూలం అది చూసేవరకూ ఉపసంహరించి, ఉపసంహరించి అక్కడకు తీసుకొని వెళ్ళాలి. కొంతమంది తేలిక మనుషులు ఉంటారు. వారి మనస్సులోపలకు వెళ్ళదు. అల్పత్వం ఉన్నవారికి, స్వల్పత్వం ఉన్నవారికి బ్రహ్మానుభవం లుగదు. నీవు సమానంగా ఉండటానికి ప్రయత్నించు. హృదయం యొక్క లోతులలోనికి ఓగాలి.

భక్తుడు అనేవాడు ఎక్కువ మాట్లాడడు. మౌనమును ప్రాక్టీసు చేస్తూ ఉంటాడు. మీతో ఏదైనా ఒక మాట మాట్లాడినా, ఏదైనా పనిచేస్తున్నా వాడి దృష్టి మీమీద ఉండదు, హృదయంలో ఉన్న పరమేశ్వరుడి అనుగ్రహాన్ని పొందటానికి ప్రయత్నం చేస్తూ ఉంటాడు. వాడికి దేహం కేంద్రంగా ఉండదు, లోకం కేంద్రంగా ఉండదు, సమాజం కేంద్రంగా ఉండదు. దేవుడిని కేంద్రంగా పెట్టుకొని ఆలోచిస్తూ ఉంటాడు, పనిచేస్తూ ఉంటాడు. వాడు భక్తుడు అంటే.

భగవాన్ దగ్గర కొంతమంది ఆశ్రమంలో లోపాలగురించి చెప్పేవారు. అరుణాచలక్షేత్రం గురించిగాని, ఆత్మగురించిగాని ఏమీ అడగకుండా కొంతమంది అక్కడ ఉన్న లోపములగురించి భగవాన్‌తో చెపుతూ ఉండేవారు. మీరు వచ్చినపని ఏదో అది చూసుకోండి అని భగవాన్ వారితో చెప్పేవారు. మీరు ఏ ఊరిలోనుండి వచ్చారో అక్కడ లోపములు లేవా? లోపములు సవరించాలి అంటే అక్కడే చేయవచ్చు కదా ఇంతదూరం రావటం ఎందుకు అనేవారు. మన అందరం చేసే పొరపాటు ఏమిటి అంటే వచ్చినపని మర్చిపోతాము. చిన్నపిల్లలను ఏదైనా వస్తువు తెమ్మని కొట్టుకు పంపాము అనుకోండి. అక్కడ ఏదైనా పగటివేషాలు, గంగిరెద్దులు కనబడితే అవిచూస్తూ ఉండిపోతారు. కొట్టుసంగతి మరచిపోతారు. మన పనీ అలాగే ఉంది. మనం ఈ భూమిమీదకు ఎందుకు వచ్చాము, దేనిని పొందటానికి వచ్చాము అన్న సంగతి మర్చిపోయాము. లోకంలో ఏవో ఆకర్షణలు కనబడుతున్నాయి. ఒకో మనిషి ఒకో ఆకర్షణకు లోబడుతున్నాడు. వచ్చినపనిని మర్చిపోతున్నారు.

ఈ శవం తల్లికడుపులోనుండి బాగానే వచ్చింది. కాని ఈ శవబుద్ధిలోనుండి బయటకు రావటం అంత తేలిక కాదు. దీనికి దీర్ఘమైన సాధన అవసరము అని ఠాగూర్ చెప్పారు. తల్లి కడుపులోనుండి దేహం వచ్చినంత తేలిక కాదు దేహబుద్ధిలో నుండి బయటకు రావటం. దానికి గురువు అనుగ్రహం అవసరము.

జ్ఞానికి తాను ఉన్నాను అన్న సంగతి వాడికి తెలుస్తూ ఉంటుంది. శరీరం మరణించినతరువాత కూడా తాను ఉంటాను అన్న సంగతి జ్ఞానికి తెలుస్తూ ఉంటుంది. దేనితోనూ తాదాప్యం ఉండదు. అదీ జ్ఞానియొక్క వైభవం. జ్ఞానికి బంధువు అవ్వటం కాదు, జ్ఞానికి స్నేహితుడు అవ్వటంకాదు, జ్ఞాని అవ్వటానికి ప్రయత్నం చెయ్యి అన్నాడు వశిష్ఠుడు. జ్ఞానికి బంధువు అవ్వటం వలన జ్ఞానం రాదు. గౌతమ బుద్ధుడి తమ్ముడికి నేను బుద్ధుడి తమ్ముడను అనుకోవటంవలన జ్ఞానం ఆగిపోయిందట. భగవాన్ తల్లికి నేను

భగవాన్ తల్లిని అనే భావన ఉండేది. అది తీసివేయటానికి భగవాన్ ప్రయత్నం చేసారు. వాడు నా కొడుకు అనే భావన తీసివెయ్యాలి అందుకు అందరు స్త్రీలు నాకు తల్లులే. నీవు కూడా ఒక స్త్రీవి అందువలన నాకు తల్లివి అనేవారు భగవాన్. ఇంత కఠినముగా ఉంటున్నాడు అని తల్లి భక్తుల దగ్గర ఏడ్చేదట. వారు భగవాన్‌తో తల్లిగారు ఏడుస్తున్నారు అని చెపితే ఏడుపు అంతా పోవటం మంచిది ఆనందము మిగులుతుంది అనేవారు భగవాన్. శరీరం చనిపోయేలోపు ఏడుపు ఏదైనా ఉంటే అది బయటకు వచ్చేయటం మంచిది. ఏడుపు ఏదైనా మిగిలి ఉంటే ఏడవటానికి ఇంకో శవాన్ని తొడగాలి. మొత్తం ఏడుపు అంతా బయటకు రావటం మంచిది. మనం సాధన చేసి శాస్త్రవాసన, లోకవాసనలను తొలగించుకోవచ్చును గాని ఈశ్వరానుగ్రహం లేకుండా దేహవాసనను తొలగించుకోలేము. దేహవాసన అంత బలీయమైనది.

ప్రతీమాటకు నా భర్తకు కోపం వస్తుంది అని ఒకరు చెపితే ఆయనతో మాట్లాడటం మానివేయండి అని చెప్పాను. బయటవారితో మాట్లాడవద్దు అంటే మానివేస్తాను, ఇంట్లో కలిసిఉంటూ మాట్లాడకూండా ఎలా ఉండటం, చాలా కష్టంకదా అని ఆవిడ అంటున్నారు. ఆవిడ వేరు, భర్త వేరు. అయినా విడిపోవటం ఎంత కష్టంగా ఉందో చూడండి. అయినపుడు నీ దేహం నుండి నీవు విడిపోవటం ఎంత కష్టమో చూడండి. నీవు ఏదైతే నేను, నేను అంటున్నావో అందులోనుండి విడిపోవాలి అని భగవాన్ చెపుతూ ఉంటే అది ఎంతకష్టంగా ఉంటుందో చూడండి. బాగా అర్ధంచేసుకోండి అందులో ఉన్న కష్టం మీకు చూపించటానికి ఇది చెపుతున్నాను.

దేహంతోటి, మనస్సుతోటి, ప్రపంచంతోటి కలిసిఉన్న నేనును అహంవృత్తి అంటారు. నీవు ఏదైతే కాదో దానితో కలసి ఉండటం అహంవృత్తి. నీవు ఏదైతే అయి ఉన్నావో దానితో కలిసి ఉండటం అహంస్ఫురణ. అహంస్ఫురణ నేను ఉన్నాను అంటుంది. దానికి దేనితోనూ తాదాప్యం ఉండదు. తాదాప్యం వచ్చింది అంటే అది అహంవృత్తి. అహంస్ఫురణ నేను అది, నేను ఇది అని అనుకోదు. అహంవృత్తి ఏదో ఒకటి అనుకోకుండా అది ఉండలేదు. దేనితోటో ఒకదానితోటి తాదాప్యం పొంది ఉంటుంది. (నీ అహంవృత్తికి శిలువ వెయ్యి నీవు జ్ఞానివి అవుతావు అంటున్నారు భగవాన్.)

తెలివైనవారిని మీరు బాగా తెలివైనవారు అంటే వారికి సంతోషం వస్తుంది. లోపల సంతోషించేది ఎవరు? అహంవృత్తే. వారి తెలివితోటి వారు తాదాప్యం పొందటం అహంవృత్తి పొంగేది. కృంగేది అహంవృత్తే. అహంస్ఫురణకు దేనితోనూ తాదాప్యం ఉండదు కాబట్టి దానికి పొంగటం, కృంగటం ఉండవు. దానికి హెచ్చు తగ్గులు, రావటం పోవటం అవి ఉండవు. అహంస్ఫురణ జ్ఞానికి సహజము. అజ్ఞానికి అహంవృత్తి ఎంత సహజముగా ఉంటుందో జ్ఞానికి అహంస్ఫురణ అంత సహజముగా ఉంటుంది. గాఢనిద్రలో నీకు దేనితోనూ తాదాప్యంలేదు. నిద్రలో దేనితోనూ తాదాప్యం లేకుండా ఎలాగ ఉన్నావో అలాగ మెలుకువలో దేనితోనూ తాదాప్యం లేకుండా ఉండగలిగితే నీకు అహంస్ఫురణ కలుగుతుంది.

అహంవృత్తికి మూడు శరీరములు ఉన్నాయి. స్థూలశరీరము, సూక్ష్మశరీరము, కారణశరీరము. కారణ శరీరము అంటే అజ్ఞానము. మన కోరికలు, రాగద్వేషములు, అసూయ ఇవి అన్నీ మనస్సులో ఉన్నాయి. దీనిని సూక్ష్మశరీరము అంటారు. రక్తము, మాంసము, ఎముకలు ఇవి అన్నీ స్థూలశరీరము. కారణ శరీరమునకు గాని, సూక్ష్మశరీరమునకుగాని, స్థూలశరీరమునకు గాని దేనికి దెబ్బ తగిలినా లోపల అహంవృత్తి బాధపడుతుంది. ఈ మూడు శరీరములతోనూ అది తాదాప్యం పొంది ఉంటుంది కాబట్టి ఈ మూడు శరీరములలో దేనికి దెబ్బ తగిలినా అది దుఃఖపడుతూ ఉంటుంది. అహంవృత్తి నశిస్తే ఇవి మూడూ నశిస్తాయి. అది నశించకపోతే ఇవిమూడూ నశించవు. నీవు చేసే కర్మనుబట్టి శరీరములు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. అది వేరే విషయం. ఈ మూడు శరీరములతో తాదాప్యం పొంది ఉన్న అహంవృత్తి నశిస్తేగాని అహంస్ఫురణ

రాదు. అహంస్ఫురణ స్వతంత్రముగా ఉంటుంది, స్వేచ్ఛగా ఉంటుంది. అహంవృత్తి స్వతంత్రముగా ఉండలేదు. మీ అత్తగారిలోనుండి వేరుపడితే సుఖం వస్తుంది అని వేరుపడతారు. అప్పుడు కూడా సుఖం రాదు. సుఖం వస్తుంది అని అనిపిస్తుంది. అహంవృత్తిలోనుండి ఇంకా వేరుపడలేదు కాబట్టి మీకు సుఖం రాదు. అత్తగారిలోనుండి వేరుపడటం నేర్చుకొన్నాము గాని అహంవృత్తిలోనుండి వేరుపడటం ఇంకా నేర్చుకోలేదు. అందుచేత సుఖం రాదు.

అహంస్ఫురణలో ఉన్నవాడు అవసరమైనపుడు మాట్లాడతాడు. మాట సహజముగా ఉంటుంది. అహంవృత్తిలో ఉన్నవాడు కల్పించుకొని మాట్లాడతాడు. ఎందుచేతనంటే వాడి వ్యక్తిభావన పెంచుకోవటంకోసం. దేహగతమైన నేను దాని Existence నిలబెట్టుకోవటంకోసం ఏ గొడవ వచ్చినా అది కలబడిపోతూ ఉంటుంది. అవసరం లేకుండా అది వెళ్ళిపోతుంది. ఎక్కడికో ఒకచోటకు వెళ్ళి దుమ్ము ప్రోగు చేసుకొనివస్తుంది. పూజగదిలోనుండి బయటకు రాగానే వెళ్ళి దుమ్ము ప్రోగుచేసుకొని వస్తుంది. మరల సాయంకాలం ప్రార్థనచేసి ఆ దుమ్మును పోగొట్టుకోవటం. అక్కరలేని గొడవలలోనికి వెళ్ళవద్దు అని భగవాన్ చెప్పారు. అబద్ధమైననేను పిలవకపోయినా వెళ్ళిపోతుంది. అడగకపోయినా సలహాలు చెపుతుంది. అది నాకు తెలుసును అని ఇతరులకు తెలియటం కోసం అలా చేస్తుంది. ఎంత గొడవ చేస్తోందో చూసారా. అందుచేత అహంకారము ఉంటే అంతా ఉంది, అదిలేకపోతే ఏదీ లేదు. సాధ్యమైనంతవరకు అహంకారము రెచ్చకుండా చూసుకోవాలి. అహంకారమును అణచటానికే యోగం. అహంభావన లేకుండా నీవు చేసే పని యోగం అని చెప్పారు. ఈ లోకమునకు సంబంధించిన పని అయినా నీవు అహంభావన లేకుండా చేస్తే అది యోగం అవుతుంది అని చెప్పారు.

ఒకసారి చలంగారు అన్నారు నీవు రావు, నన్ను పోనీవు, మరల్చి, మత్తెక్కించి, స్వప్నాలతో లాలించి మధురగానాలతో ఊగించి ప్రపంచానికి వ్యర్థునిగా చేశావు ఓ భగవాన్ అన్నారు. తలుపు సందున పెట్టి నొక్కేస్తున్నావు. బయటకు పోతానంటే పోనివ్వటం లేదు, నీలో ఐక్యం చేసుకొంటావంటే చేసుకోవటంలేదు. ప్రపంచములో గొప్ప సంపాదించుకొందామని అనుకొన్నాను. ప్రపంచమునకు పనికిరాకుండా చేసావు. నీ స్వరూపమును నాకు ఇవ్వటంలేదు. మధ్యలో తలుపుసందున పెట్టి నొక్కేస్తున్నావు. సాధనదశలో ఆయన వేదనను చెపుతున్నాడు.

భగవాన్ అరుణాచలేశ్వరుడితో నీకు నేను ఆహారాన్ని. నీవు నా దగ్గరకు రానక్కరలేదు. నేనే నీ దగ్గరకు వచ్చాను. నీ చేతికి అందుతున్నాను. నీవు చేయవలసింది ఏమిటి అంటే ఈ నేనును భుజిస్తే నీకు ఆకలి తీరుతుంది. నాకు పీడ వదులుతుంది. ఏదైతే నేను, నేను అంటున్నానో అది నీకు ఆహారము. అది నీవు తీసుకొంటే నీకు ఆకలి తీరుతుంది. నాకు పీడ వదులుతుంది. నా అశాంతికి ఏదైతే కారణమో దానిని నీవు తీసుకొంటే నాకు శాంతి మిగులుతుంది అంటున్నారు. దేవుడు అంటే మనకి ఇష్టమే. కాని దేవుడు వచ్చి ఈ నేనును తింటాను అంటే తిననివ్వము. కారణం ఏమిటి అంటే ఈ నేను పోతే మనం పోతాము అని భయం. ఈ నేనును తీసేసుకొని మనలను విడిచిపెట్టేయడు. ఈ నేను రాగిలాంటిది. దేవుడు నేను బంగారంలాంటిది. ఈ నేనును తీసుకొన్న వెంటనే బంగారము మనకు ఇచ్చేస్తాడు. మన దగ్గర ఉన్న రాగిని తీసుకొని బంగారమును ఇస్తాడు. ఇందులో నష్టపోయేది దేవుడే. ఆయన నష్టపోవటానికి ఇష్టపడి మనతోటి వ్యాపారం చేస్తాను అన్నా మనం ఒప్పుకోవటంలేదు.

**(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 21-3-96)**